తన వ్యక్తిత్వాన్ని నిలుపుకోవడం కోసం భర్తని ఎదిరించి ఆమె తీసుకున్న నిర్ణయం?

# నేనూ మనిషినే

**దేవరకొండ గంగాధర రామారావు**

**కథ**

సుహాసిని తన గదిలో ఆధునికంగా అలంకరించబడిన డ్రాయింగ్ రూంలో సోఫాలో కూర్చుంది. దానికి ఆనుకునే డైనింగ్ హాలుంది. ఆమె చుట్టూ వస్తువులు చూస్తూ ఆలోచనల్లో మునిగిపోయింది. నేలమీద తివాసి, పాదాల్ని ఒత్తుతున్నట్లు మెత్తగా వుంది. కొంచెం దూరంలో ఫ్రిజ్జి మంచుపలకలా మెరుస్తోంది. మరో మూలగా 'ఎల్లప్పుడూ మీ సేవలో' అంటున్నట్లు ఒదిగి వుంది ఓ బల్లమీద గ్రైండరు. పైన ఫ్యాను అవిశ్రాంతంగా తిరుగుతోంది గాలికి సుహాసిని ముంగురులు ముఖంమీద పాకుతూ అల్లరి చేస్తున్నాయి. కాని సుహాసిని దృష్టి ఫ్యానువైపు మళ్లింది.

ఫ్యాను తిరుగుతూంది. దానిలో కదలిక వుంది. కాని చైతన్యం లేదు. అది ఆగాలంటే ఆగలేదు. తిరగాలంటే తిరగలేదు. ఆ శక్తి తనలో వుంది. దానిని త్రిప్పగలదు. ఆపగలదు. కారణం అది యంత్రం. తను చైతన్యం వున్న మనిషి. తనకి అస్థిరత్వం వుంది తను మనిషి నిజంగా. నిజంగా? ఆమె హృదయం ఘోషించింది. ఇంతలో గడియారం సమయం గుర్తు చేస్తూ నాలుగు గంటలు కొట్టింది. ఆమె మామూలు ప్రపంచంలో పడింది. నాలుగు! ఆమెను ఆ గంటలు కొరడాతో కొట్టినట్టయింది. ఈ రోజు భర్త నరేష్ నాలుగు గంటల పదిహేను నిమిషాలకు వస్తానని ముందుగానే చెప్పాడు. కాని ఆ విషయం మర్చిపోయింది. అతను వచ్చేసరికి టిఫిన్, కాఫీ అన్నీ అమర్చాలి!

సుహాసిని ఒక్క గంతులో కిచెన్‌లోకి పరుగెత్తింది. తొందరలో చేయగలిగింది అతనికిష్టమైంది టిఫిన్ క్షణంలో నిర్ణయించింది. సుశిక్షితమైన వేళ్లతో ఉల్లిపాయలు తరిగింది. కావలసినవన్నీ సమకూర్చింది. ఒక్కసారి గ్రైండరు గుండెలు చీలుస్తున్నట్లు గిర్‌మంది. స్టౌమీద రెండు



బర్నరులు భగభగ మండాయి. సుహాసిని కిచెన్‌లో ఓ రోబట్‌లా చకచకా తిరిగింది. ఇరవై నిమిషాలలో చేయవలసిన టిఫిన్ కేవలం పది నిమిషాల్లోనే చేసింది. ఫిల్టర్ కాఫీ దిగుతోంది. ఇంక ఫ్రిడ్జిలోంచి తీసిన పాలు ఒక్క పొంగు రావాలి. సుహాసిని నుదుటిమీద చెమటలు చిందాయి.

ఇంతలో డోర్ బెల్ మోగింది. పాలు పొంగిపోతున్నాయి. ఒక్క గంతులో వెళ్లి స్టౌ స్విచ్

కట్టెయ్యబోయింది. అది కొంచెం పట్టుగా వుండి తిరగలేదు. డోర్ బెల్ మళ్లీ అసహనంగా మోగింది. సుహాసిని పట్టకారతో పాల గిన్నె దింపి, పరుగున వెళ్లి తలుపు తీసింది.

గుమ్మంలో నిలువెత్తు మనిషి ఆమె భర్త నరేష్ నుంచుని ఆమెకేసి హేళనగా చూస్తూ అన్నాడు. 'నిద్రపోతున్నావా? తలుపు తియ్యడానికింత ఆలస్యమా?''

''అదికాదు. పాలు పొంగుతుంటే...''. ఆమె గొంతులో సన్నగా వణుకు.

''చాలు. ఎప్పుడూ ఏదో కథ! వెళ్లు యూ సిల్లీ ఫూల్!'' అంటూ బూట్లు టకటకలాడించుకుంటూ లోపలకు వెళ్లాడు. అతను నడుస్తుంటే పోతపోసిన అహంకారం కదులుతున్నట్టుంది. సుహాసిని పడిన ఇంత శ్రమ ఆమెకు సంపాదించిన బిరుదు 'సిల్లీ ఫూల్' ఆమె కళ్లలో నీళ్లు! ఆమె ఆలోచనలు గతంలోకి వెళ్లాయి

★ ★ ★

నరేష్ తన స్వశక్తిమీద పైకొచ్చాడు. పెద్ద పదవిలో వున్నాడు. కారు, అన్ని హోదాలు వున్నాయి. సుహాసిని లేనివాళ్ల పిల్ల అని తెలిసి, కావాలనే చేసుకున్నాడు. సుహాసిని తండ్రి రామ్మూర్తి బడి పంతులు. అతని కూతురికి కట్నం లేకుండా ఇంత పెద్ద సంబంధం చేశాడని జిల్లా అంతా చెప్పుకున్నారు. తన అదృష్టానికి సుహాసిని మురిసిపోయింది. స్నేహితురాళ్లందరూ ఆమెను అభినందనలతో ముంచెత్తారు.

పెళ్లయిన వెంటనే హనీమూన్‌కి వెళ్లారు. నరేష్ ఆమెను వింత వింత ప్రదేశాలలో తిప్పాడు. పెద్ద హోటళ్లలో ఉన్నారు. ఎన్నో విచిత్రాలు చూశారు. కానీ హనీమూన్ పూర్తికాకుండానే అందులో హనీ కరిగిపోయింది సుహాసిని దృష్టిలో. ఇక మిగిలింది మూన్ షైన్!

నరేష్ దురహంకారి. గర్విష్టి. తన మాటే నెగ్గాలి. తన అభిప్రాయమే చెల్లుబడి కావాలి. అతనికి ప్రేమా, అనురాగం, లాలన, సరసం... ఇవేమీ అక్కర్లేదు. అసలా సున్నితమైన భావాలకు స్పందించే హృదయమే లేదు. అతనిక్కావలసింది విజయం. ఇంకా పై హోదాలకి ఎలా ఎగబాకడం, ఎలా తన ఆదాయం పది రెట్లు చేసుకోవడం, ఎలాగ తన సబార్డినేట్స్‌ని గజగజలాడించడం. అతను తనమీద వివర్శ భరించడు. సుహాసిని కూడా ఒక సబార్డినేట్!

సుహాసిని ముచ్చటపడి ఓ జరీ అంచు వెంకటగిరి చీర కావాలంటే 'నాన్సెన్స్. దానికి పదిరెట్లు ఖరీదైన నైలెక్స్ కొంటాను' అంటాడు. ఆ నైలెక్స్ చీరే ఇంటికి వస్తుంది. సుహాసిని మనసు ఆ చేనేత చీర అల్లికలో, అందంలో చిక్కుకుపోతుంది.

'బీచ్‌కి వెళదామండీ' అని సుహాసిని అంటే 'నో' ఇవాళ మనం పిక్చరుకెళుతున్నాం!'' ఆ రోజు బలవంతంగా సినిమా హాల్లో కూర్చున్న సుహాసిని లేత మనసు నీలాల సముద్రం మీద తేలుతోందని అతనికి అర్థం కాదు. సుహాసిని కోరుకున్నవీ కొంటాడు. కావాలన్నవీ చేస్తాడు. కానీ అతనిక్కూడా ఇష్టమైతేనే! నరేష్ ఇష్టమే సుహాసిని ఇష్టం కావాలి! తన ఆలోచనలకి, ఇష్టాలకి విరుద్ధంగా ఏమీ జరుగకూడదు. ఇది లిఖించని శిలాశాసనం.

కాని సుహాసిని ఈ తరహా జీవితం ఊహించుకోలేదు. అసలు వివాహమంటే ఇలా వుంటుందనికూడా ఊహించలేదు. ఆమె దృష్టిలో వివాహం ఓ పవిత్ర బంధం. అందులో ఎవరూ ఎవరినీ శాసించే పనిలేదు. భార్యాభర్తల హోదాలు ఇద్దరికీ సమానమే. పరస్పర ప్రేమానురాగాలతో సాగిపోవాలి. ఒకరి అభిప్రాయాలని ఒకరు గౌరవించాలి. ఒకరికోసం ఒకరు త్యాగం చెయ్యాలి.

భర్తకు భార్యమీద ఎంత అధికారం వుందో భార్యకూ భర్తమీద అంతే అధికారం. కాని నరేష్ భావాలు ఇందుకు పూర్తిగా విరుద్ధం. సుహాసిని ఆంతర్యంలో నిరాశా నిస్పృహలు చోటుచేసుకున్నాయి. ఆమె అందాల స్వప్నం చెదిరిపోయింది. ఆమెలో ధిక్కారం తలెత్తింది. కొద్ది నెలల్లోనే నరేష్ని కాదని తన ఇష్టప్రకారం నడుచుకోవడం మొదలుపెట్టింది. కాని నరేష్ ఆమె చోటు గుర్తుచేశాడు. ఈ ఇల్లు నాది. నాతో వుండాలంటే నా ఇష్ట ప్రకారమే వుండు. కాని సుహాసిని ఊహల్లో ఈ ఇల్లు, సంసారం ఇద్దరిదీ. నరేష్ ఆమె కుర్రతనపు ఊహలు తప్పని స్పష్టం చేశాడు. సుహాసిని అలిగి, కోపగించి పుట్టింటికి వెళ్లింది.

తండ్రి తన కూతురుని రాణిని చేశానని ఉప్పొంగిపోతున్నాడు. ఆమె వచ్చిన సందర్భంగా తన మిత్రులను విందుకు పిలిచాడు. అందరూ సుహాసిని అదృష్టాన్ని, ఆమె భర్త హోదాని పరిపరి విధాల ప్రశంసించారు. తనని వేధిస్తున్న సమస్య తండ్రి దగ్గర చెప్పుకునే సావకాశమే రాలేదు. వారం రోజులు పోయాక ఆయన స్టేషనుదాకా సాగనంపుతూ కూతురితో అన్నాడు. 'నాకింక ఏం కావాలిరా తల్లీ. మీ అమ్మ పోయింది. నీ భవిష్యత్తు ఎలా దిద్దుతానా అని బెంగతో కుమిలిపోయాను. ఇప్పుడు నిన్ను చూసి గర్విస్తున్నాను. మీ అమ్మ స్వర్గంలో వుండి నిన్ను దీవిస్తుంది. నన్ను అభినందిస్తుంది'' అంటూ కళ్లు తుడుచుకున్నాడు. ఆమె కళ్లకింద నీలినీడలు ఆయన చూడలేదు. ఆమె గుండె చప్పుడు ఆయనకు వినిపించలేదు. కురవని మేఘాల్లాంటి కళ్లతో తండ్రిదగ్గర సెలవుతీసుకుంది.

గుమ్మంలో ఆమెను చూస్తూనే నరేష్ అన్నాడు. ''రా! నువ్వు వస్తావని నాకు తెలుసు. నీకు వేరే గత్యంతరం లేదు'' సుహాసిని తల సిగ్గుతో వాలిపోయింది. గుండెల్లో రక్తం చిందింది. బాధ, అవమానం, ఆగ్రహం, అన్నీ మింగుకుని లోపలికి నడిచింది. మళ్లీ ఎప్పటిలా సంసారం. కాని భర్త దృష్టిలో మరింత చులకనైంది. తన నిస్సహాయతని వెల్లడి చేసుకుని అతని అహంకారానికి మరింత దోహదం చేసింది.

ఓరోజున చిన్న విషయానికి సుహాసిని అలిగి ముఖం ముడుచుకుని కూర్చుంది. నిజానికి అదేం పెద్ద విషయం కాదు ఆమె దృష్టిలో. ఓరోజు

## ఊరిబస్సు

వంశీ, సురేష్లు అర్ధరాత్రి ఒంటిగంటకు బస్టాండ్కు చేరుకున్నారు. బస్టాండ్ అంతా నిర్మానుష్యంగా వుండడంతో వంశీ సురేష్తో అన్నాడు ''ఓ బస్ని దొంగిలించుకుని మన వూరు వెళ్లిపోదాం''

సురేష్ బస్సులమీద వున్న పేర్లు చదివి పెదవి విరిచాడు. ''లాభం లేదు. మన వూరికి వెళ్లే బస్ అన్నిటికన్నా చివరన వుంది''

- పి.వి. మురళీకృష్ణ (హైద్రాబాద్)



స్టీరియోలో తనకిష్టమైన క్లాసికల్ సంగీతం రికార్డు పెట్టుకు వింటోంది. ఎప్పుడు వచ్చాడో నరేష్, ఆ క్యాసెట్ తీసి ఏదో రాక్ మ్యూజిక్ క్యాసెట్టు పెట్టాడు.

'ఏమిటండీ అలా చెప్పకుండా క్యాసెట్ తీసేశారు. మీ రాక్ సంగీతం ఇప్పుడింత అర్జంటుగా వినాలా? అయినా నాతో చెప్పి తీయవచ్చుగా?'' అని విసుక్కుంది.

''పాట పెట్టుకోడానిక్కూడా నీ పర్మిషన్ తీసుకోవాలా? నీ బోడి సంగీతం, నేను ఇంట్లో లేనప్పుడు పెట్టుకో'' అన్నాడు.

''పోనీ ఆ విషయమే ముందుగా చెప్పొచ్చుగా'' ఆమె రెట్టించింది.

''నోర్ముయ్. ఇలాంటి వాటిలో వాదన పెంచకు'' హెచ్చరించి వెళ్లిపోయాడు. సుహాసిని ఓ మూలకు పోయి కుమిలి కుమిలి ఏడ్చింది. మరో గంట పోయాక నరేష్ వచ్చి ఆమెను చూసి అన్నాడు.

''ఏమే ఇంత సంపదలో పడేస్తే నీకు వెగటుగా వుందా? నిన్ను ఏ గుమాస్తాకో కట్టబెట్టి వుంటే ఈపాటికి నువ్వు అంట్లు తోముకుంటూ ముష్టిబతుకు బతికేదానివి. ఏం చూసుకుని ఆత్మాభిమానం అంటూ కుమిలిపోతున్నావ్? ఇడియట్! ఇక నాకు కోపం తెప్పించకు''

అతనికి అర్థమైంది అంతే. ఆమెకు ఇంట్లో అన్నీ వున్నాయి. కానీ ఆమె ఆశించిన అనురాగం, తన వ్యక్తిత్వానికిగౌరవం లేవు. ఆమె దృష్టిలో ఇక్కడా ఆమెది ముష్టిబతుకే. ప్రతిక్షణం అతని దయాధర్మాలమీద బతకాలి. ఎప్పుడు నేను, నాది అంటుందో అప్పుడే అతను తన అధికారం గుర్తుచేస్తుంటాడు. ఈ బ్రతుకు బ్రతకలేదు. నరేష్కి ఏదో కారణం చెప్పి, మళ్లీ పుట్టింటికి వెళ్లింది.

ఈసారికి తండ్రికి తన సమస్య అంతా వివరించింది. 'నేనూ బి.ఏ చదువుకున్నాను. తెలివిలో ఆయనకేం తీసిపోను. నిజానికి నేనే ఆయనకన్నా సంగీతం, సాహిత్యం ఎక్కువ తెలిసినదాన్ని. ఆయన ఉద్యోగానికి పనికొచ్చే పెద్ద కోర్సులు చదివి ఉద్యోగం సంపాదించి గొప్పవాడయ్యాడు. అంతమాత్రాన నా వ్యక్తిత్వాన్ని కించపరిస్తే భరించలేను. నాకూ గౌరవం ఇవ్వడం ఆయన నేర్చుకోవాలి''

తండ్రి అంతా విన్నాడు. కూతురు కాపరంలో సుఖపడడంలేదు అని మాత్రం తెలుసుకున్నాడు. జాలిపడ్డాడు. కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. ఇన్నాళ్లు కూతురు ఎంతో సుఖంగా వుందని భ్రమించాడు. కాని ఈ వాస్తవం ఆయనను కృంగదీసింది. ఆమెను బాధించే విషయాలు, ఆత్మగౌరవం, వ్యక్తిత్వం, స్వతంత్రం. ఇవన్నీ ఆయనకు అంత పట్టించుకోవలసిన విషయాలుగా తోచలేదు. పెద్ద ఇల్లు, కారు, ఇంట్లో అన్నీ వున్నాయి. కూతురికి కావలసిన నగలు, బట్టలు కొంటాడు. ఎటొచ్చీ తన మాటే నెగ్గాలంటాడు. ఏదో తిక్క మనిషి. అతను చెప్పినట్టే చేస్తే పోయిందేముంది. అమ్మాయి ఎందుకింత చిన్న విషయాలకి మనసు పాడుచేసుకుంటోంది అని ఆయన మనసులో అభిప్రాయం. అల్లుణ్ణే మందలించే స్థితిలో తనున్నాడా? ఎలాగో అమ్మాయే సర్దుకుపోవాలి. ఈ మాత్రం దానికి కాపరం వదులుకోవడం మూర్ఖత్వం కాదూ.

అమ్మాయి మనసు నొచ్చుకోకుండా ఎలాగో తన మనసులో అభిప్రాయం ఆమెకు తెలియజేశాను. సుహాసిని తండ్రి దగ్గరనుంచి అంతకన్నా విరుద్ధమైన సలహాకూడా ఆశించలేదు. ఆయనకాలంనాటికి ఇంకా స్త్రీకి ప్రత్యేక ప్రతిపత్తి లేదు. స్త్రీ ఎప్పుడో ఎవరో ఒకరి ఇష్టాఇష్టాల ప్రకారమే బతికేది. అది బానిసత్వం అని ఎవరూ అనుకోలేదు. సుహాసిని తండ్రి పెళ్లినాటికి చాలా

మార్పులు వచ్చినా ఇంకా పాత సంప్రదాయాల ప్రభావం పోలేదు.

సుహాసినికి సానుభూతి కావాలి. తన సమస్యను అర్థం చేసుకుని తనకు నైతిక బలం ఇచ్చేవాళ్లు కావాలి. తన స్నేహితురాలు సుశీల వుంది ఈ ఊళ్లోనే. ఆమె బాగా చదువు, సంస్కారం కలది. ఆమె తప్పక తన సమస్య అర్థం చేసుకుంటుంది. బహుశా పరిష్కారంకూడా సూచిస్తుంది. సుహాసిని సుశీల ఇంటికి వెళ్లింది.


సుశీల ప్రశ్నలూ, మర్యాదలూ అయ్యాక సుహాసిని తన కథంతా వివరించింది. ఎంతో సుఖంగా వుందనుకున్న సుహాసిని గుండెల్లో ఇంత బాధ దాచుకుందని తెలిసి సుశీల చాలా బాధపడింది. ఆమె బాధలన్నీ ఎంతో ఓర్పుగా వింది. చివరకు అంది. 'సుహాసిని, నువ్వు మన నాగరికతో ఎన్నో దశాబ్దాలు ముందుకు వెళ్లిపోయి ఆలోచిస్తున్నావో లేక, ఇంకా మన స్కూలు, కాలేజీ జీవితాల్లో ఊహించుకున్న రొమాంటిక్ భావాలనుంచి బయటపడలేదో అర్థంకావడంలేదు.

నిజమే స్త్రీ వ్యక్తిత్వానికి గుర్తింపు వుండాలి. ఆమెనొక ఆటబొమ్మగా ఆడించకూడదు. కాని మన సమాజంలో ఇప్పట్లో స్త్రీకి అంత గుర్తింపు లభిస్తుందా? బస్సులో గర్భిణీ స్త్రీ నుంచున్నా లేచి సీటిచ్చే మగాడు లేడు. నువ్వు స్వతంత్రంగా ఏదైనా ఆఫీసులో పని చేశావనుకో, ఏమాత్రం తప్పు చేసినా 'ఏవమ్మా కళ్లు మూసుకుని పనిచేస్తున్నావా?' అని విరుచుకుపడే అధికార్లు లేక నీ పొందుకోసం నిన్ను అహర్నిశలు వేధించే అధికార్లు తప్ప నిన్ను నీ వ్యక్తిత్వాన్ని గౌరవించేవాళ్లు దొరుకుతురా? వాస్తవ పరిస్థితులు కొంచెం జాగ్రత్తగా ఆలోచించు!''

సుహాసిని ఆమె మాటలకు నిరుత్సాహపడింది. ''అంతేనంటావా? ఇలా పూర్తిగా నా వ్యక్తిత్వం చంపుకుని నా భర్త కాళ్ల దగ్గర బానిసగా పడి వుండాలంటావా?''

సుశీల ఆమెతో ఏకీభవించలేకపోయింది. ''సుహాసినీ, నేను నీ అంత అభ్యుదయ భావాలుకలదాన్ని కాకపోవచ్చు. కానీ నాకూ కొన్ని విలువలు, అభిప్రాయలూ వున్నాయి. సంసారం అంటే నా అంచనా, అవగాహన వేరు. దానికి మన చదువులు, డిగ్రీలతో పనిలేదు. నీ భర్తలో కొన్ని బలహీనతలున్నాయి. కాదనను. అతను అహంకారి. గర్విష్టి! అతన్ని నీ అనురాగంతో, నీ త్యాగంతో సరైన

# అలనాటు



చక్కని పెర్ఫార్మెన్స్ ఇవ్వగల తారలు మన తెలుగు చలనచిత్రరంగంలో ఎందరో వున్నారు. ఉదాహరణకు 'శుభలగ్నం'లో ఆమని ఎంత చక్కగా నటించింది. అయినా మన తెలుగు నిర్మాత, దర్శకులు ఎందుకనో పరభాషా నాయికలనే దిగుమతి చేసుకుని చక్కని పాత్రలు ఇస్తున్నారు. ఉదాహరణకు 'సాహసవీరుడు-సాగరకన్య' చిత్రంలో శిల్పాశెట్టి, 'మౌనం' చిత్రంలో నగ్మా, ఇలా ఎంతోమంది పరభాషా హీరోయిన్స్ వచ్చి మన చిత్రాలలో చక్కని పాత్రలు వేస్తుంటే, మన తెలుగు తారలు, ప్రేక్షకులు మౌనంగా వుండి పోతున్నారు. మనది సర్దుకుపోయే మనస్తత్వంగదా! మరి ఇది ఇలా ఎంతకాలం సాగుతుందో కాలమే నిర్ణయించాలి.

- సుబ్బారావు

[illegible]. కనీసం నీ ప్రయత్నం ఆ మార్గంలో సాగనీయి. అతని సుఖంకోసం, ఆనందంకోసం, కనీసం అతని 'ఈగో'ని సంతృప్తిపరిచేందుకైనా నువ్వు కొంత త్యాగం చెయ్యి. త్యాగంలోనే నిజమైన తృప్తి, ఆనందం వుంది. మన పురాణేతిహాసాలు మనకు అందించిన జీవిత సత్యం అదేననుకుంటా. ఆనాడు సీతాదేవి, నా వ్యక్తిత్వం, నా ఆత్మాభిమానం అంటూ అగ్నిపరీక్షకు అంగీకరించి వుండకపోతే ఈనాడు ఇన్ని శతాబ్దాలుగా, ఇందరి హృదయాలలో మహాసాధ్విగా నిలబడగలిగేదా?''

సుహాసిని ఒక్కసారి ఆవేశంగా అంది. ''అవును సీత మహాసాధ్విగా నిలిచిపోయింది. కానీ సీతగా ఆనాడే ఆ మంటల్లో ఆహుతి అయిపోయింది. సుశీలా, సారీ. నువ్వు నా మంచికోరి చెప్పావు. కానీ మన భావాలు పూర్తిగా వ్యతిరేకం. సీతకు జరిగిన అన్యాయం ఏ స్త్రీకి జరగకూడదని నా అభిప్రాయం. నేను పతితగా చావనైనా చస్తానుకాని, బానిస పతివ్రతగా, అమరత్వం కోరుకోను. నా భర్తను హింసించాలని, అతనిమీద అధికారం చలాయించాలని నా భావం కాదు. నాక్కావలసింది గుర్తింపు. నా వ్యక్తిత్వానికి ఓ గౌరవ స్థానం. అది లభించిననాడు నా భర్తకోసం నా ప్రాణాలైనా ఇస్తాను''

సుశీల అంది ''నాకు తోచింది చెప్పాను. కానీ నీ జీవితాన్ని గురించి నీకు కొన్ని స్థిరమైన భావాలున్నాయి. అవి తప్పో, రైటో అని చెప్పగలిగే సామర్థ్యంకాని, అర్హతకాని నాకు లేదనుకుంటాను. కాని ఏం చేసినా చిత్తశుద్ధితో, ఆలోచించుకుని మరీ చెయ్యి!''

సుహాసిని ఇంటికి వచ్చేసింది. సుహాసినికి ఒక్క విషయం మాత్రం స్పష్టమైంది. తను ఏ వ్యక్తిత్వం కోసం అహర్నిశలూ తపించి వాపోతోంది. అది ఎవరి దృష్టిలోనూ అంత అమూల్యమైనదిగా లేదు. దాన్ని పణంగా పెట్టి కావలసిన సుఖాల్ని, సంపదల్నీ కొనుక్కోవచ్చనే చాలామంది అభిప్రాయం. సమస్య తనది. పరిష్కారంకూడా తన చేతిలోనే అది. ఎప్పుడు ఏ రూపు దిద్దుకుంటుందో ఆ క్షణంలో ఆమెకు ఏమీ తెలియదు.

ఇంటికి రాగానే నరేష్ ఆమెను మామూలుగానే ఆహ్వానించాడు. అతనికి సుహాసిని వెళ్లిన పని తెలియదు. తన కాపరం గురించి అందరితో చర్చించి, నిర్ణయం తీసుకోవడానికి వెళ్లిందని తెలిస్తే మళ్లీ ఆ గుమ్మంలో కాలు పెట్టనిచ్చేవాడే కాదు. రోజులు దొర్లిపోతున్నాయి. ఎక్కువ భాగం నిస్సారంగా నరేష్ మూడొంతులు ఆఫీసు పనితో తలమునకలౌతూ వుంటాడు. ఆఫీసులో ఏదైనా సమస్యలొస్తే ఆ చికాకంతా సుహాసిని మీద రుద్దుతూ వుంటాడు. రాత్రి భార్యగా ఒడిలోకి తీసుకుంటాడు. అతను తన సౌఖ్యం కోసం ఏర్పరచుకున్న అనేకానేక పరికరాల్లో భార్య ఒకతి!

★ ★ ★

''ఏం నిద్రపోతున్నావా నిలబడే?'' నరేష్ మాటలకు ఉలిక్కిపడి సుహాసిని ''ఆ.. లేదు. రండి మీకోసమే ఎదురుచూస్తున్నాను. మీ టిఫిన్ రెడీ చేశాను''

అతను ఫలహారం తీసుకుంటూ అన్నాడు. ''మనం ఇవాళ సినిమాకు వెళ్తున్నాం. మా బిజినెస్ పార్ట్‌నర్ ఒకతను వచ్చాడు. అతణ్ణి ఎంటర్‌టెయిన్ చెయ్యాలి. సినిమాకెళదాం రమ్మన్నాను'' సుహాసిని గతుక్కుమంది.

''సారీ, మీరు వెళ్లండి. ఇవాళ టి.విలో మంచి క్లాసికల్ మ్యూజిక్ ప్రోగ్రాం వుంది. నా ఫ్రెండ్ సుభద్రగారిని రమ్మన్నాను. పాపం ఆవిడ ఇంతదూరం నాకోసం వస్తుంది''

''సుభద్రా? ఆవిడకీ నాకూ పనీ పాటా లేదు.

అన్నిళ్లూ తిరుగుతూ వుంటుంది. నువ్వులేందే ఇంకో ఇంట్లో దూరుతుంది. పరవాలేదు. సినిమాకు తయారవు'' నరేష్ చులకనగా అన్నాడు. కాని సుభద్ర అందరిళ్లూ తిరిగే మనిషికాదు. తను రమ్మని మరీ మరీ కోరితే కంపెనీ ఇవ్వాలని వస్తోంది. ఆ మాటే అతనితో అంది.

''నా ఫ్రెండ్‌తో నిన్నుకూడా తీసుకువస్తున్నానని చెప్పాను. ఇప్పుడు నువ్వు రాందే, నువ్వు సొసైటీలో నలుగురితో కలిసిమెలిసి తిరగలేవనుకుంటాడు''

సుహాసినికి ఎంతమాత్రం వెళ్లాలని లేదు. ''ఒక్కరోజు సినిమాకురానంత మాత్రాన నన్ను పల్లెటూరిదాన్ననుకుంటాడా? అయినా మీతో పార్టీలకొస్తూనే వుంటానని అందరికీ తెలుసుకదా''


''సుహాసినీ, ఈ వాదనలకు అంతుండదు. నువ్వు సినిమాకు వస్తున్నావ్!

అంతే. గెట్ రెడీ!'' అని నరేష్ రూమ్‌లోకి వెళ్లిపోయాడు.

సుహాసిని ముఖం ఎర్రబడింది. పిడికిలి కుర్చీ చేతికి బిగుసుకుని నరాలు ఉబ్బాయి. పెదాలు వణికాయి. వెళ్లను. వెళ్లను. వెళ్లను అనుకుంది. మరుక్షణమే దాని పర్యవసానం ఊహించుకుని కలవరపడింది. వెళ్లాలి. వెళ్లి తీరాలి. లేదా నరేష్ క్షమించడు! ఆమె కళ్లలోంచి వెచ్చని బిందువులు బుగ్గలమీదుగా జారి టపటపా నేలమీద పడుతున్నాయి. ఆమె కళ్లు ఎర్రబడి వాచిపోయాయి. అలాగే వెళ్లి ముఖం కడుక్కుని బట్టలు వేసుకుని సినిమాకు ముస్తాబైంది. ఇంతలో నరేష్ ఫ్రెండ్ వచ్చాడు.

మామూలు పరిచయాలయాయి. ఆమె ముఖంలోకాని, మాటల్లోకాని ఉత్సాహం లేదు. ఆమె ఏడ్చి ఏడ్చి వచ్చినట్టు రమేష్‌కి తెలిసింది. అతని మిత్రుడు ఆమె మనసు బాగాలేదని గ్రహించాడు. ''మీ శ్రీమతికి వంట్లో బాగున్నట్లు లేదు. ఆమెను వుండిపోమనండి'' అన్నాడు.

నరేష్‌కి ఆ మాత్రం జ్ఞానం కూడా లేకపోయింది. ''అబ్బే. ఆమె బాగానే వుంది. రెండు రోజులనుంచి కొద్దిగా రొంపగా వుంది అంతే'' సుహాసిని లేని నవ్వు తెప్పించుకుని ''అంతే. నాకు బాగానే వుంది'' అంది. ఆమె ఎంత ప్రయత్నించినా ఆ సాయంత్రం సహజంగా మాట్లాడలేకపోయింది. నవ్వలేకపోయింది. సంభాషణలో చలాకీతనం



చూపలేకపోయింది. ఆమె అనుమాన భారంతో కృంగిపోయింది. గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. ఎలాగో సినిమా హాల్లోంచి బయటపడింది. అతని స్నేహితుడిని హోటల్ దగ్గర దింపి, నరేష్, సుహాసిని ఇంటికి చేరారు.

అంతవరకు నరేష్ ఎలాగో నిగ్రహించుకున్నాడు. ఇంటికి రాగానే ఆగ్రహంతో విరుచుకుపడ్డాడు. ''ఏమే రాస్కెల్! నిన్నెవరో చిత్రవధ చేసినట్టు ఇవాళంతా అలా ఏడుపు మొహం పెట్టుకున్నావే? నా ఫ్రెండ్ దగ్గర ఎంత షేమ్ అయిపోయానో తెలుసా?''

సుహాసినికి ఓపిక నశించింది ఆమె అంతకన్నా బాధగా, కోపంగా అంది ''నేనూ షేమ్ అయ్యాను. మా ఫ్రెండ్ సుభద్ర వచ్చి వెళ్లిపోయుంటుంది''

''నీ పనికిరాని ఫ్రెండ్ సుభద్రా, నా ఫ్రెండూ ఒకటే!'' అతను మళ్లీ అరిచాడు.

''ఆ ఇద్దరూ ఒకటే! స్నేహానికి, గౌరవానికి అంతస్థులతో సంబంధం ఏమిటి? అయినా మీరు నేను రాను అంటుంటే బలవంతంగా ఎందుకు తీసుకెళ్లారు?'' సుహాసిని ఎదురుతిరిగింది. అతను భరించలేకపోయాడు. ''ఓహో, పొగరుమోతు సమాధానాలు చెప్పావంటే జాగ్రత్త!'' అని మీదకు వచ్చాడు. సుహాసినికి దుఃఖం పొర్లివచ్చింది ''ఏం కొడతారా?'' అంది కోపంతో వణుకుతున్న కంఠంతో.

''అవసరమైతే! కాని ఆ అవసరం లేదు''

అతను విసవిసలాడుతూ బెడ్‌రూమ్‌లో కెళ్లిపోయాడు. కళ్లమ్మటి నీళ్లు కారుతుంటే సుహాసినికి వెక్కి వెక్కి ఏడుస్తూ డ్రాయింగ్ రూమ్ సోఫాలో కూలబడింది. కన్నీళ్లు ధారగా కారుతున్నాయి. ఆమెను ఓదార్చేవారు లేరు. భర్త వచ్చి ప్రేమగా బుజ్జగించి తీసుకువెళ్లే ప్రసక్తి లేనే లేదు. ఆమే కుక్కలాగో, పిల్లిలాగో తోకముడుచుకుని వెళ్లి అతని పక్కన పడుకోవాలి. అతనికి తెలుసు ఈ పెంపుడు కుక్కలని కొట్టవలసిన అవసరం కూడా లేదని. అతని సుఖం కోసం నరేష్ ఎన్నో సమకూర్చుకున్నాడు. టి.వి, ఫ్రిడ్జి, స్టీరియో, కారు... భార్య! జీవంలేని వస్తువుల జాబితాలో ఈ జీవమున్న వస్తువుకూడా భాగమైపోయింది. సుహాసిని అనే వ్యక్తి వుందని అతను గుర్తించలేదు. అతనికో భార్య వుంది. అంతే!

ఈ ఆలోచన సుహాసినిని భయపెట్టింది. తను కరిగి, ఆవిరై శూన్యంలో కలిసిపోతున్నట్టనిపించింది. ఈ ఇంట్లో తనని తను ఎక్కడ వెతుక్కోవాలి? 'నేనేమైపోయాను' అని ఆమె హృదయం ఆక్రోశించింది. కన్నీళ్లు కారి కారి ఆరిపోయాయి. రాత్రి రెండు గంటలు దాటింది. నరేష్ మంచి నిద్రలో గురక తీసుకున్నాడు. సుహాసిని ఆలోచనల మంటల్లో కాలిపోతోంది. కన్నీళ్లు నిస్సహాయతకి నిదర్శనం. సమస్యకు పరిష్కారం కాదు. పరిష్కారం తనలో వుంది. తన గుండెల్లో వుంది.

అలనాడు పిట్స్‌బర్గ్‌లో ఇంగ్లీషువాడు ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లోంచి గెంటేస్తే ఏ అచంచల ఆత్మశక్తి ఎముకలు కొరికే చలిలో గాంధీజీని నిలబెట్టిందో అందులో అణుమాత్రం వచ్చి ఈ రాత్రి ఈ సిల్లీ ఫూల్, రాస్కెల్, చవట సుహాసినిలో ప్రవేశించింది.

సుహాసినిలో ఇన్నాళ్లుగా నిద్రాణంగా వున్న వ్యక్తిత్వం మేలుకుంది. నిప్పు కణంలా, ప్రాణంలా కదిలింది ఆమె శరీరం. ఎర్రగా మండింది. ఆ క్షణాల్లో ఆమెకు ఎంతగానో ఎదిగిపోయినట్టనిపించింది. హిమాలయ శిఖరాలపై విహరించి, సముద్రపు లోతులలో జలకమాడినంత శక్తివంతంగా నిర్మలంగా వుంది ఆమె హృదయం. ఆమె అలాగే నిర్భయమూర్తిగా కూర్చుంది. రావమ్మూర్తి కూతురిలా కాదు. సుశీల

స్నేహితురాలిగా కాదు. నరేష్ భార్యగా అసలే కాదు. సుహాసినిలా. తూరుపు తెలవారుతోంది. మసకగా వున్న ప్రకృతి సుందరాకృతి దాల్చుతోంది. పక్షులు కిలకిలారావాలు ఆకాశం వైశాల్యాన్ని గానం చేస్తున్నాయి. సూర్యుడి మొదటి కిరణం సుహాసినిని పలకరించింది.

నరేష్ లేచాడు. పక్కన భార్యలేదు. విసురుగా డ్రాయింగ్ రూమ్‌లోకొచ్చి చూశాడు. ''ఇక్కడ కూర్చుని ఏం చేస్తున్నావ్? నాకు బెడ్ కాఫీ తేవాలని తెలియదూ?''

''తెలుసు. కాని నేను తేను. మీరే తెచ్చుకోండి'' ఏమీ తొట్రుపాటు లేకుండా చెప్పింది.

''పిచ్చి ముదిరిందా? వెళ్లు. పది నిమిషాల్లో తీసుకురా!''

అతను గదిలోకి వెళ్లాడు. సుహాసిని కదలలేదు. పది నిమిషాల తర్వాత అతను మండిపోతూ వచ్చాడు. ''యూ ఫూల్! కాఫీ తెమ్మంటే తేలేదే?'' సుహాసిని లేచి దగ్గరగా వెళ్లి అతని కళ్లలోకి సూటిగా చూస్తూ అంది. ''యూ ఫూల్! నిన్ను చేసుకోమంటే మళ్లీ వచ్చావే?''

ఎంత ధైర్యం! నరేష్ ఉగ్రుడైపోయాడు. చెయ్యెత్తి కొట్టబోయాడు. సుహాసిని చెయ్యి అడ్డుపెట్టింది. ఆ దెబ్బ గాజులకు తగిలి, అందులో గాజువి పగిలి క్రింద పడ్డాయి. నరేష్ ఈ తిరుగుబాటుకి ఎంతమాత్రం సిద్ధంగా లేడు. ఇప్పుడు ఎలా ప్రవర్తించాలో అతనికే అర్థంకాలేదు. ఆవేశంతో వణికిపోతూ ''నిన్నూ! నిన్నూ...'' అని మాటలకోసం తడబడ్డాడు.

''ఏమీ చెయ్యలేవ్!!'' ఆ మాటలు అతని గుండెల్లో చాకుల్లా గుచ్చుకున్నాయి.

''పో! నా ఇంట్లోంచి పో. ఇప్పుడే ఈ క్షణం!''

''అరవకు. వెళతాను'' అని సుహాసిని ద్వారంవైపు నడిచింది. నరేష్ సోఫాలో కూలబడ్డాడు. అతని ముఖంనిండా చెమటలు.

''ఆగు'' అరిచాడు. ''నా వస్తువులన్నీ వదిలి వెళ్లు!''

సుహాసిని టక్కున ఆగింది. తన వంటిమీద వస్తువులు చూసుకుంది. ఇందులో అన్నీ ఇంచుమించు అతనివే. అసలు తనే అతనిది. కాని అతనది గుర్తించలేదు. సుహాసిని నెమ్మదిగా తన రూమ్‌లోకెళ్లింది. నరేష్ సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ కూర్చున్నాడు. ఇలా జరుగుతుందని

## కొమ్ములు

అష్టావధానం జరుగుతుండగా మధ్యలో సుబ్బారావు అప్పారావుతో అన్నాడు.


''అతను కొమ్ములు తిరిగిన అష్టావధాని!''

''అయితే నాకు కళ్లజోడు అవసరమే'' సందేహంగా అన్నాడు అప్పారావు.

''ఏం! నీకు సరిగా కనిపించడంలేదా?''

''అవధానిగారు బాగానే కనిపిస్తున్నారు. కానీ అతని కొమ్ములే కనిపించడంలేదు!''

- భవానీ శ్రీనివాస్ (అర్ధంపల్లి)



ఎన్నడూ ఊహించలేదు. హఠాత్తుగా సుహాసిని మీద తన అధికారమంతా నశించి పోయిందని అతనికి అర్థమైంది. తన అధికారం, దర్పం, హోదా, ధనం అన్నీ ఆమెముందు తృణప్రాయం. అరగంట గడిచాక సుహాసిని స్నానం చేసి బట్టలు మార్చుకుని వచ్చింది. ఆమె ముఖం విరిసిన గులాబీలా వుంది. సన్న జరీ అంచు నేతచీర కట్టుకుంది. వివాహంనాడు తన వంటిని వున్న జత గాజులు, ఒంటిపేట గొలుసు, చెవులకు దుద్దులుమాత్రం వేసుకుంది. తన ముఖ్యమైన బట్టలు, వస్తువులు ఓ సూట్‌కేసులో పెట్టుకుని, సూట్‌కేసు చేత్తో పుచ్చుకుని నరేష్ దగ్గరకు వచ్చి నిలబడింది. నరేష్ ఓసారి తలెత్తి ఆమెను చూసి మళ్లీ తల దించుకున్నాడు. అతని ముఖం మాడిపోయి వుంది. సుహాసిని బాధ, ఛీత్కారం కలిసిన స్వరంతో అంది. ''చూడు నీ వస్తువులన్నీ గదిలో భద్రంగా పెట్టాను. వెళ్లి చెక్‌చేసుకో. ఎలా వచ్చానో అలా వెళ్తున్నాను. నేనూ నీ దాన్నే. కానీ నీకా విషయం అర్థం కాలేదు. దురహంకారంతో విర్రవీగిపోయావు. కాని నాలాంటి ప్రేమించే భార్య కావాలంటే నన్ను వెతుక్కుంటూ రా. లేదా మరో బానిస కావాలంటే, మళ్లీ పెళ్లి చేసుకో. నే వెళుతున్నాను''

నరేష్‌ని 'నువ్వు' అంది. చిన్నపిల్లవాణ్ణి మందలించినట్టు మందలించింది. అతను కోపంగా చూసినంతనే నిలువెల్లా వణికిపోయే సుహాసిని ఈవేళ అతనిని వీసమెత్తు గౌరవించడంలేదు. అయినా అతడు నిర్వీర్యుడు, అశక్తుడూ అయిపోయాడు.

ఆమె ముందుకు కదిలింది. ఇంటి డోర్ తెరిచి బయట గ్రావెల్ పాత్‌మీద అడుగుపెట్టింది. నరేష్‌ని వెనక్కి రమ్మని పిలవలేదు. పిలుస్తాడని ఆమె ఆశించలేదు. ఆమె వీధిగేటు తీసుకుని బయట అడుగుపెట్టింది. అప్పటికే బాగా తెల్లవారింది. వీధిలో జనం తిరుగుతున్నారు. సుహాసిని వాళ్లలో కలిసిపోయింది. నరేష్ భార్యగా కాదు. స్త్రీగా, సుహాసినిగా, ఆత్మాభిమానమున్న మనిషిగా. ★

